సాక్షి మహబూబాబాద్

ఆదివారం । 9 । ఏప్రిల్ । 2023



తెలంగాణపై మోదీ అక్కసు

ప్రధాని మోదీ తెలంగాణను అన్ని రాష్ట్రాలతో సమానంగా చూడకుండా అక్కసు వెల్లగక్కుతున్నారని మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతిరాథోడ్ ఆరోపించారు. - 8లో▸



తొలిరోజు ప్రశాంతం

పోలీస్ నియామకాల్లో భాగంగా స్టయిఫండరీ క్యాడెట్ ట్రెనీ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ రాత పరీక్ష తొలిరోజు ప్రశాంతంగా జరిగింది. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.4^{0} / 21.1^{0}

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత పెరిగి ఉక్కపోతగా ఉంటుంది.



న్యూస్‌రీల్

ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి పనులు



డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని డోర్నకల్ శాసనసభ్యుడు డీఎస్ రెడ్యానాయక్ కోరారు. మున్సిపాలిటీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో రూ.25 కోట్ల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనుల ప్రతిపాదనలపై చర్చించారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, మినీ ట్యాంక్‌బండ్, మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణం, ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకుల నిర్మాణం తదితర పనులకు నిధుల కేటాయింపునకు సంబంధించిన ప్రతిపాదనలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు ఉపయోగపడే పనులను ప్రణాళిక ప్రకారం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం, కమిషనర్ శ్రీనివాసరావు, డీఈ భీమానాయక్, ఏఈ హార్థిక పాల్గొన్నారు. కాగా కాంగ్రెస్‌కు చెందిన అమ్మపాలెం ఎంపీటీసీ సభ్యురాలు దరంసోత్ పద్మ భర్త నాగేశ్వర్‌రావుతో పాటు గంజి నర్సయ్య, రాందేని నాగేశ్వర్‌రావు తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

ఏఐకేఎంఎస్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

నెహ్రూసెంటర్: అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర రెండో మహాసభలను విజయవంతం చేయాలని సంఘ రాష్ట్ర కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ.. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఈ మహాసభలు జరుగుతున్నాయని, మహాసభల విజయవంతం కోసం రైతులు, రైతుకూలీలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో దేశెట్టి రాంచంద్రయ్య, బూర్క వెంకటయ్య, గుజ్జు దేవేందర్, యాదగిరి, యుగేందర్, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు

మహబూబాబాద్ అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఈ నెల 11న మానుకోట జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో మధ్యాహ్నం 2గంటలకు డిగ్రీ విద్యార్థులకు జిల్లా స్థాయి వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ నూకల శ్రీరంగారెడ్డి, కరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ వై.కృష్ణప్రసాద్ శనివారం ఒకప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 9490116468 ఫోన్ నంబర్‌ను సంప్రందించి పేరును రిజిస్టర్ చేసుకోవాలన్నారు. గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ప్రదానం చేస్తామన్నారు.

ఇది మాయమాటల ప్రభుత్వం



మహబూబాబాద్ రూరల్: నీళ్లు, నిధులు, నియామకాలు, ఎంతో మంది నిరుద్యోగుల బలిదానాలతో ఏర్పడిన తెలంగాణలో సీఎం కేసీఆర్ మాయమాటలతో మోసం చేస్తున్నారని వైఎస్సార్ టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుగులోతు రాములునాయక్ ఎద్దేవా చేశారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామంలో శనివారం రిలే దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా ప్రధాన కేంద్రాల్లో పార్టీ అధినేత్రి షర్మిల పిలుపు మేరకు రిలే దీక్ష చేపట్టామన్నారు. తెలంగాణ ప్రభుత్వ నిర్లక్ష్యంతో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. పేపర్ లీకేజీ వ్యవహారమంతటికి ప్రభుత్వమే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్లావత్ బలరాం, బోడ సురేష్, బానోత్ వెంకన్న, వెంకన్న, బాసు, వాగ్యా, బానోత్ భద్రు, సాగర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి మట్టికుండ

వేసవిలో పెరిగిన విక్రయాలు
- రూ. 250 నుంచి రూ. 400 వరకు ధర
- మట్టికుండ నీటితో సురక్షితం



విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న మట్టిపాత్రలు

నెహ్రూసెంటర్: వేసవికాలం వచ్చిందంటే ప్రతి ఒక్కరూ మట్టికుండ నీరు తాగేందుకు ఇష్టపడతారు. పెరుగుతున్న ఆధునీకరణలో భాగంగా ఫ్రిడ్జ్, ఇతర పాత్రలు అందుబాటులోకి రావడంతో మట్టి కుండల ప్రభావం తగ్గిపోయింది. పేదోడి ఫ్రిడ్జ్‌గా పేరున్న మట్టికుండలకు మానుకోట జిల్లా కేంద్రంలో వేసవికాలం ప్రారంభంలోనే వీటి విక్రయాలు ఊపందుకుంది. మట్టికుండలను వాడేవారు రోజు రోజుకు ఎక్కువవుతున్నారు. దీంతో సీజన్ ప్రారంభంలోనే గిరాకీలు పెరిగాయని తయారీదారులు తెలుపుతున్నారు. జిల్లా కేంద్రంలోని సిగ్నల్‌లో మట్టికుండలు, మట్టి పాత్రలు, బాటిళ్లను తయారు చేసి హోల్‌సేల్‌గా విక్రయిస్తున్నారు. ఇంట్లో చల్లని నీరు తాగేందుకు కుండలను కొనుగోలు చేస్తున్నారు. మట్టితో తయారు చేసిన కుండలకు ట్యాప్‌లను అమర్చడంతో ఎక్కువగా అమ్ముడవుతున్నాయని తయారీదారులు చెబుతున్నారు.


మట్టికుండతో ప్రయోజనాలెన్నో..

మట్టికుండలోని నీటిని తాగడం వలన ఆరోగ్యంతో పాటు వేడిమి నుంచి ఉపశమనం లభిస్తుంది. నీటిలో ఉండే మలినాలను పీల్చుకుని నీటిని చల్లగా మార్చి అందించే శక్తి మట్టికుండకు ఉంటుంది. ప్రతి రోజు మట్టి కుండలో నీటిని తాగితే వడదెబ్బ నుంచి రక్షణ పొందవచ్చు. కరోనా కారణంగా ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టిన ప్రజలు ఇన్ని రకాల ప్రయోజనాలు ఉన్న నేపథ్యంలో మట్టికుండలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

మట్టికుండల ధరలు (రూ.ల్లో)

మట్టికుండ	: 250
ట్యాప్‌తో కూడిన కుండ	: 350
జగ్గులు	: 150
మట్టి వాటర్ బాటిల్స్	: 150

సండే స్పెషల్



మట్టికుండ (రంజన్)ను తయారు చేస్తున్న రవీందర్



తోపుడు బండిపై మట్టికుండలను విక్రయిస్తున్న మహిళ

గిరాకీ పెరిగింది..



మట్టితో తయారు చేసిన కుండలకు గిరాకీ పెరిగింది. వేసవి సీజన్ ప్రారంభం కాగా చలివేంద్రాలు, ఇంట్లోకి ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం మట్టికుండలకు ట్యాప్‌లు పెట్టి విక్రయాలు చేస్తున్నాం. ఈ ఏడాది విక్రయాలు, తయారీ ఎక్కువగా ఉంది.

– సతీష్, మానుకోట

35 ఏళ్లుగా మట్టి పాత్రల తయారీ..



మట్టిపాత్రల తయారీ, కుండలు, ఇతర మట్టి పాత్రలను 35 ఏళ్లుగా తయారు చేసి విక్రయిస్తున్నాం. పండుగలకు, శుభకార్యాలకు కుండలను అందజేస్తున్నాం. ఎండాకాలం సీజన్‌లో మట్టికుండలు (రంజన్) ఎక్కువగా అమ్ముడుపోతున్నాయి. ప్రభుత్వం కులవృత్తిపై ఆధారపడి జీవించే వారికి తయారు చేసిన పాత్రలను విక్రయించేందుకు మున్సిపాలిటీ పరిధిలో స్థలం చూపించాలి.

– పెంటయ్య, మట్టికుండల తయారీదారుడు, మానుకోట



శిల్పం వర్ణం కృష్ణం పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్ తదితరులు

18న రామప్పలో శిల్పం వర్ణం కృష్ణం వేడుకలు

- ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి
- వేడుకల పోస్టర్ ఆవిష్కరణలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

హన్మకొండ: ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా ఈ నెల 18న ములుగు జిల్లా రామప్పలో శిల్పం వర్ణం కృష్ణం పేరుతో వేడుకలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, గిరిజన, మహిళ సంక్షేమ శాఖమంత్రి సత్యవతి రాథోడ్‌లు తెలిపారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో శిల్పం వర్ణం కృష్ణం వేడుకల పోస్టర్‌లను వారు ఆవిష్కరించారు. మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ అద్భుతమైన రామప్ప కట్టడానికి ప్రపంచ వారసత్వ గుర్తింపు దక్కడానికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేశారన్నారు. వేడుకలకు నిర్మాత దిల్‌రాజుతో మాట్లాడనని, బలగం యూనిట్ బృందాన్ని పంపిస్తున్నట్లు చెప్పారని తెలిపారు. ఆ చిత్రాన్ని కూడా ప్రదర్శించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, ములుగు జిల్లా యంత్రాంగం అంగరంగ వైభవంగా వేడుకలను నిర్వహించేందుకు శాయశక్తులా కృషి చేస్తుందన్నారు. మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ రామప్పలో 18న నిర్వహించే వేడుకల కోసం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ రూ.2 కోట్లు విరాళంగా ఇస్తుందన్నారు. ఫుడ్‌ఫెస్టివల్, స్టాళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, సినీప్రముఖులతో ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. అంతకుముందు వేడుకల వివరాలను వాసవి గ్రూపు ప్రతినిధి రవి వివరించారు. కార్యక్రమంలో ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, శంకర్ నాయక్, ములుగు జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఇలా త్రిపాఠి, జేఎస్ భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా, ములుగు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బీఫార్మసీ ఐదో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీఫార్మసీ (సీబీసీఎస్) ఐదో సెమిస్టర్ పరీక్షలు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) ఈ నెల 12వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. ఈ నెల 12న పేపర్1 మెడిసినల్ కెమిస్ట్రీ, 15న పేపర్2 ఇండస్ట్రియల్ ఫార్మసీ, 18న పేపర్ థర్డ్ ఫార్మసీకాలజీ, 20న ఫోర్త్ పేపర్ ఫార్మాకాగ్నసీఅండ్ ఫైతోకెమిస్ట్రీ, 24న ఐదో పేపర్ ఫార్మస్యూటికల్ జ్యూరిస్‌ప్రుడెన్స్ పరీక్షలు జరగనున్నాయని వివరించారు. ఆయా తేదీల్లో పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయని వారు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: హైదరాబాద్ పర్యటనకు వస్తున్న ప్రధాని మోదీ గోబ్యాక్ అంటూ సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శనివారం ర్యాలీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. తొమ్మిదేళ్ల బీజేపీ పాలన నియంతృత్వంగా సాగుతుందని విమర్శించారు. బయ్యారంలో స్టీల్ ఫ్యాక్టరీ ప్రారంభించి, బొగ్గు గనుల ప్రైవేటీకరణను నిలిపివేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య, జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి, పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం నాయక్, రావుల రాజు, చీపిరి యాకయ్య, పాల బిందెల మల్లయ్య, కుమ్మరికుంట్ల నాగన్న, తోట శ్రీనివాస్, వెంకన్న, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్ల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ శ్రీపాల

మహబూబాబాద్ అర్బన్: మైనార్టీ జూనియర్ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల సంఖ్యను పెంచాలని మైనార్టీ పాఠశాల, కళాశాలల కోఆర్డినేటర్ శ్రీపాల తెలిపారు. జిల్లా కేంద్రంలోని మైనార్టీ జూనియర్ కళాశాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శ్రీపాలా మాట్లాడుతూ.. రిజిస్టర్‌ల విధి విధానాలను, రికార్డులను ఎప్పటికప్పుడు భద్రపరచాలని ఎటువంటి పొరపాటు జరిగిన తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అధ్యాపకులు విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని, వరంగల్ రంగశాయిపేట జక్కలుద్ది మైనార్టీ జూనియర్ కళాశాలలో మైనార్టీ విద్యార్థులకు ఎంసెట్‌పై 45 రోజుల ఉచిత శిక్షణ అందిస్తున్నామన్నారు. మైనార్టీ విద్యార్థులు కళాశాలల్లో చేరే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి మక్బల్‌పాష, అంజాద్‌అలీ, అకాడమిక్ కోఆర్డినేటర్ రుహినా, కళాశాల ప్రిన్సిపాల్ ఇమాముద్దీన్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

హనీరోజ్ సందడి

- వైభవంగా 'కళ్యాణలక్ష్మి' పునఃప్రారంభం

హనుమకొండ కొత్త బస్టాండ్ రోడ్‌లో కొత్త హంగులతో రూపుదిద్దుకున్న కళ్యాణలక్ష్మి షాపింగ్ మాల్ శనివారం సాయంత్రం అంగరంగ వైభవంగా పునఃప్రారంభమైంది. సినీతార హనీరోజ్ సాయంత్రం సందడి చేసింది. ఆమెను చూసేందుకు అభిమానులు తరలిరావడంతో ఆ రోడ్డు అంతా కిక్కిరిసింది. చీరలు చూపుతూ హొయలొలికించింది. ఆమెతో సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు.

– హన్మకొండ చౌరస్తా

- వివరాలు 8లో▸



చీరతో హొయలొలికిస్తున్న సినీతార హనీరోజ్

టెన్త్ పరీక్ష కేంద్రం పరిశీలన



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

మహబూబాబాద్ అర్బన్: పట్టణంలోని మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ కె.శశాంక శనివారం పరిశీలించారు. సెంటర్‌లోని సౌకర్యాలు, విద్యార్థుల పరీక్ష తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. జిల్లాలో మొత్తం 50 పరీక్ష కేంద్రాల్లో 50 సూపర్‌వైజర్లను నియమించామన్నారు. విద్యార్థులు రాసేందుకు అన్ని సౌకర్యాలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశామని, విద్యార్థుల ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. కాగా శనివారం నిర్వహించిన గణితం పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు 8,461 మందికి 8,443 మంది హాజరుకాగా 18 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు తెలిపారు. అలాగే ప్రైవేట్ విద్యార్థులు 52 మందికి 42 మంది హాజరైయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీజీ మందుల శ్రీరాములు, ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీవైపు ఎమ్మెల్సీల చూపు

ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు ఎక్కువ మంది ఎమ్మెల్సీల ఆసక్తి
- స్టేషన్‌ఘన్‌పూర్‌లో మొదలై డోర్నకల్ వరకు
- భూపాలపల్లి, జనగామలోనూ ఇదే తీరు
- ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ పెరుగుతున్న స్వరం
- ఫలితంగా ఎమ్మెల్యేలు వర్సెస్ ఎమ్మెల్సీలుగా రాజకీయం
- గులాబీ పార్టీలో రగులుతున్న ఇంటిపోరు



సాక్షిప్రతినిధి, వరంగల్: శాసనమండలి కంటే శాసనసభే బాగుంటుందని అధికార పార్టీ ఎమ్మెల్సీలు పలువురు ఆసక్తి చూపుతున్నారు. త్వరలోనే అసెంబ్లీ ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఈ మధ్యకాలంలో దూకుడు మరింత పెంచారు. ఎమ్మెల్యేగా ఎన్నికైతే కీలక పదవులు పొందవచ్చని కొందరు, ఎమ్మెల్సీ అయితే ప్రతి కార్యక్రమానికీ ఎమ్మెల్యేల మీద ఆధారపడి ఉండాల్సి వస్తోందని, ఏ నియోజకవర్గం తమది కాకుండా పోతోందని మరికొందరు.. ఇలా పలు కారణాలతో ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఏడాదిలోనే శాసనసభకు ఎన్నికలు రానుండడంతో ఎమ్మెల్సీల వ్యూహాలు, ప్రయత్నాలు రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల మధ్య అంతర్గత విబేధాలు సైతం రోజురోజుకూ రాజుకుంటున్నాయి.

శాసనసభవైపు ఎమ్మెల్సీల చూపు...

ఉమ్మడి వరంగల్ నుంచి మండలిలో ఉన్న పలువురు ఎమ్మెల్సీలు అసెంబ్లీపై కన్నేశారు. ప్రధానంగా స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి ఈ సమస్య ఉత్పన్నం కాగా, ప్రస్తుతం డోర్నకల్, జనగామ, భూపాలపల్లి నియోజకవర్గాల్లోనూ ఇదే తంతు కొనసాగుతోంది. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా డాక్టర్ టి.రాజయ్య ఉండగా, ఇక్కడినుంచి ఎమ్మెల్సీ కడియం శ్రీహరి పోటీ చేసేందుకు ఆసక్తిగా ఉన్నారు. డోర్నకల్ ఎమ్మెల్యేగా మాజీ మంత్రి, సీనియర్ డీఎస్ రెడ్యానాయక్ వ్యవహరిస్తుండగా, ఎమ్మెల్సీ, మంత్రి సత్యవతిరాథోడ్ పేరు ప్రచారంలో ఉంది. గండ్ర వెంకటరమణారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న భూపాలపల్లి నియోజకవర్గంనుంచి శాసన సభ మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి కూడా టికెట్ ఆశిస్తున్నారు. జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి ఇటీవల ప్రత్యర్థులు పెరుగుతున్నారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ప్రయత్నంలో ఉన్నారన్న ప్రచారం మొదట జరగ్గా, ఇప్పుడు ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం నియోజకవర్గంలో కీలకంగా తిరుగుతున్నారు. దీంతో ఈ నాలుగు నియోజకవర్గాల్లో కొద్ది రోజులుగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల మధ్య మాటలు మంటలు రేపుతుండగా.. ఒకరిపై ఒకరు స్వరం పెంచుతుండటం గులాబీ బాస్‌కు తలనొప్పిగా మారుతోంది.

ఆ నాలుగు సెగ్మెంట్లలో అగాథం...

- స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ఇద్దరు మాజీ ఉప ముఖ్యమంత్రులు టి.రాజయ్య, కడియం శ్రీహరిల మధ్య పంచాయితీ తారస్థాయికి చేరుకుంది. 2019లో మొదలైన వైరం నిన్నటి ఆత్మీయ సమావేశాల వరకు.. పరస్పర ఆరోపణలు మంటలు రేపుతున్నాయి. ఆత్మీయ సమావేశాలకు ఎమ్మెల్సీకి సమాచారం ఇవ్వడం లేదని కడియం శ్రీహరి బహిరంగ వ్యాఖ్యలు చేయగా, సమాచారం ఇస్తున్నామంటూ ఎమ్మెల్యే రాజయ్య ముక్తాయింపు ఇచ్చారు. కానీ ఇద్దరు కలిసి పాల్గొన్నది లేదు.
- జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సొంతపార్టీ నుంచి సెగ ఎక్కువైంది. ఎమ్మెల్సీగానే ఉంటానని పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించినా.. ఇటీవల భువనగిరి నుంచి మూడోలైన్ పొడిగించి ఎంఎంటీఎస్ రైలును జనగామ వరకు నడపాలని లేఖ రాయడం చర్చనీయాంశమైంది. మరోవైపు జనగామ జిల్లా తరిగొప్పుల మండలం సోలిపురం గ్రామంలో స్థానిక జెడ్పీటీసీ భర్త వెంకట్‌రెడ్డి జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఆయన బావమరిది గుజ్జ సంపత్ రెడ్డిల అండదండలతో కురుమలపై దాడులకు పూనుకుంటున్నాడని కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం బహిరంగ ఆరోపణలు చేశారు. ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఎమ్మెల్సీ మల్లేశం సంఘ విద్రోహులకు మద్దతుగా ఉన్నారని, ఎమ్మెల్సీగా ఉండి ఒకే వర్గంవైపు మాట్లాడటం సరైంది కాదని కౌంటర్ ఇచ్చారు.
- డోర్నకల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే రెడ్యానాయక్.. మంత్రి సత్యవతి రాథోడ్‌ల మధ్య పోరు ఉధృతమైంది. శుక్రవారం సీరోలులో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో రెడ్యానాయక్, ఆయన కుమారుడు రవిచంద్ర, ఎంపీ కవితలు సంచలన వ్యాఖ్యలు చేశారు. తన ఓటమికి కుట్ర చేస్తున్నారని పరోక్షంగా మంత్రి సత్యవతి రాథోడ్, ఆమె వర్గంపై చేసిన విమర్శలు దుమారం రేపుతున్నాయి.
- భూపాలపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి ఎదురీత తప్పేలా లేదు. కాంగ్రెస్ నుంచి గెలిచి అధికార పార్టీలో చేరిన గండ్ర రమణారెడ్డి తన భార్యను వరంగల్ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్‌ను చేసుకోగలిగారు. అయితే ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఆయన వర్గం నేతలతో మాత్రం కలిసిమెలిసి ఉండలేకపోతున్నారు. మాజీ స్పీకర్ చారి, రమణారెడ్డిల మధ్య పెరుగుతున్న దూరం భూపాలపల్లి అధికార పార్టీలో ఆధిపత్య పోరును పెంచుతోంది.


'ఈస్టర్' వెలుగులు



విద్యుత్ దీప కాంతుల్లో సీఎస్‌ఐ చర్చి

మహబూబాబాద్ రూరల్: క్రీస్తు పునరుత్థాన (ఈస్టర్) పండుగ వేడుకలను పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సీఎస్‌ఐ చర్చి (పరిశుద్ధ పౌలు దేవాలయం) ను శనివారం రాత్రి విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. నేడు జిల్లాలోని అన్ని చర్చిల్లో ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిపేందుకు ఆయా చర్చిల నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

● ఆకాశంలో వింత మేఘాలు



సాయంకాలం అస్తమించడానికి ముందు భానుడి అందాలు, (ఇన్‌సెట్‌లో) గర్జిస్తున్న సింహం లాంటి మేఘం

ఉపరితల ఆవర్తన ప్రభావంతో విపరీతమైన ఎండతో పాటు సాయంత్రానికి మేఘాలు అద్భుతంగా దర్శనం ఇస్తున్నాయి. వింత ఆకారాలు, సూర్యాస్తమయ సమయంలో ఎర్రబడిన ఆకాశం మధ్య భానుడి అందాలు స్థానికులను మైమరపిస్తున్నాయి. ఈ చిత్రాలను మహ–బాద్ పట్టణంలో శనివారం 'సాక్షి' క్లిక్ మనిపించింది. – కొత్తగూడ

తెలంగాణపై ప్రధాని మోదీ అక్కసు

సింగరేణి సంస్థను ప్రైవేట్‌పరం చేసేందుకు కుట్ర
- విభజన చట్టం హామీల అమలుపై నిర్లక్ష్యం
- నిరసనలో మంత్రులు దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్‌


ధర్నాలో మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు


హాజరైన కార్మికులు, బీఆర్‌ఎస్‌ పార్టీ నాయకులు

భూపాలపల్లి అర్బన్‌: ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణను అన్ని రాష్ట్రాలతో సమానంగా చూడకుండా మన రాష్ట్రంపై అక్కసు వెల్లగక్కుతున్నారని, రాష్ట్రంలో నాలుగు సింగరేణి బ్లాక్‌లను ప్రైవేట్‌పరం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని రాష్ట్ర మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్‌ ఆరోపించారు. రాష్ట్రానికి ప్రధాని మోదీ రాకను నిరసిస్తూ.. సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బీఆర్‌ఎస్‌ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌ సెంటర్‌లో మహాధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీలు పసునూరి దయాకర్‌, మాలోతు కవిత, ఉమ్మడి వరంగల్‌ జిల్లాలోని ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్‌, పెద్ది సుదర్శన్‌రెడ్డి, శంకర్‌ నాయక్‌, ఆరూరి రమేష్‌, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, జెడ్పీ చైర్మన్లు పుట్ట మధు, సంపత్‌, శ్రీహర్షిణి, బిందు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడారు. గత ఏడాది రామగుండం ఎరువుల ప్యాక్టరీ ప్రారంభోత్సవానికి వచ్చిన మోదీ సింగరేణిని ప్రైవేటీకరణ చేయబోమని ప్రకటించి, ఢిల్లీ వెళ్లిన తర్వాత మరోసారి బొగ్గు బ్లాకుల వేలం వేశారని అన్నారు. గుజరాత్‌లోని బొగ్గు బ్లాక్‌లను ఆ రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించిన మోదీ తెలంగాణలోని బ్లాక్‌ను సింగరేణికి, రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని పలుమార్లు కోరినా.. ఎందుకు కేటాయించడం లేదో సమాధానం చెప్పాలన్నారు. కేంద్రానికి సీఎం కేసీఆర్‌ సహకరించడం లేదని ప్రధాని గత రెండేళ్లుగా తెలంగాణకు రావాల్సిన నిధులను కేటాయించడం లేదన్నారు. విభజన చట్టంలో హామీలు అమలు చేయడం లేదని తెలిపారు. సింగరేణి లాభాల్లో 30శాతం వాటా కార్మికులకు ఇస్తున్నారని, మన రాష్ట్రంలో ఉన్న మన బ్లాక్‌లను అనుమతులు ఇవ్వడం లేదన్నారు. దేశంలో సరిపడా బొగ్గు ఉత్పత్తి అవుతున్నప్పటికీ విదేశాల్లోని బొగ్గును బలవంతంగా విద్యుత్‌ సంస్థలతో 10రెట్లు అధిక ధరతో కొనుగోలు చేయిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అబాసుపాలు చేసేందుకు కుట్రలు చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ పదో తరగతి పరీక్ష ప్రశ్నాపత్రాన్ని లీక్‌ చేయించారని అన్నారు. ఎనిమిదేళ్లుగా తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. పండించిన వరి ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులను ఆందోళనకు గురి చేశారన్నారు. సింగరేణిని రక్షించుకునేందుకు బీఆర్‌ఎస్‌తో కలిసి వచ్చే పార్టీలు, సంఘాలను కలుపుకొని కేంద్రంపై పోరాటాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో వెంకటరాణిసిద్ధు, బుర్ర రమేష్‌, నారాయణరెడ్డి, సమ్మయ్య, జనార్దన్‌, హరిబాబు, మధు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా 'కళ్యాణలక్ష్మి' పునఃప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రులు దయాకర్‌రావు, సత్యవతి


నిర్వాహకులతో చీరను ప్రదర్శిస్తున్న హీరోయిన్‌ హనీరోజ్‌

- హాజరైన మంత్రులు దయాకర్‌రావు, సత్యవతి
- నందడి చేసిన సినీ తార హనీ రోజ్‌

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ కొత్త బస్టాండ్‌ రోడ్‌లో కొత్త హంగులతో రూపుదిద్దుకున్న కళ్యాణలక్ష్మి షాపింగ్‌మాల్‌ శనివారం సాయంత్రం అంగరంగ వైభవంగా పునఃప్రారంభమైంది. తెలుగు, తమిళ సంప్రదాయాలు ఉట్టిపడేలా మేళతాళాల నడుమ ప్రభుత్వ చీఫ్‌విప్‌ దాస్యం వినయ్‌భాస్కర్‌, నగర మేయర్‌ గుండు సుధారాణి, కార్పొరేటర్‌ వేముల శ్రీనివాస్‌లతో కలిసి రాష్ట్ర మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్‌లు హాజరై షాపింగ్‌మాల్‌ ను ప్రారంభించారు. గడిచిన దశాబ్దకాలంగా ఉమ్మడి జిల్లా ప్రజలతో పాటు కరీంనగర్‌ ప్రజలకు సుపరిచితమైన కళ్యాణలక్ష్మి మళ్లీ ప్రజలకు అందుబాటులోకి రావడం సంతోషంగా ఉందని అతిథులు అన్నారు.

హనీరోజ్‌ సందడి

సినీ తార హనీరోజ్‌ సుమారు గంటపాటు కళ్యాణలక్ష్మి షాపింగ్‌ మాల్‌లో సందడి చేసింది. చీరకట్టుతో మురిపించింది. హనీరోజ్‌ను చూసేందుకు పెద్దసంఖ్యలో చేరిన అభిమానులతో షాపింగ్‌మాల్‌ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.

ప్రజలకు మళ్లీ చేరువలో..

ఉమ్మడి వరంగల్‌, కరీంనగర్‌ జిల్లాల ప్రజలకు నాణ్యమైన, అధునాతన వస్త్ర ప్రపంచాన్ని అందుబాటులో ఉంచుతూ.. తమ కస్టమర్లు, శ్రేయోభిలాషుల నమ్మకాన్ని, ప్రేమను చూరగొనేలా సరసమైన ధరలకు అందుబాటులోకి తెచ్చామని ఆ షాపింగ్‌మాల్‌ యజమాని లక్ష్మణ్‌దాస్‌ అట్టల్‌ తెలిపారు.

ప్రాణం తీసిన క్షణికావేశం

క్షణికావేశం ఎంత ప్రమాదకరమో.. ఈఘటనలు చూస్తే అర్థం చేసుకోవచ్చు. తన వాహనాన్ని ధ్వంసం చేశాడని ఒకరు.. పాత తగాదాల నేపథ్యంలో ఒకరు మరొకరిపై దాడి చేయడంతో వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. క్షణికావేశంలో జరిగిన ఈఘటనలు ఆ రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపాయి.

వాహనం ధ్వంసం చేశాడని..


మురళి మృతదేహం

పెద్దవంగర: కూలీ డబ్బుల విషయంలో జరిగిన గొడవ ఓ వ్యక్తి మృతికి కారణమైంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్‌ జిల్లా పెద్దవంగర మండలంలోని గంట్లకుంట గ్రామానికి చెందిన దుర్సోజు మురళి (55) కుల వృత్తి వడ్రంగి పనులతో పాటు కూలీ పనుల చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ముత్తినేని రాములుకు కూలీ పనులకు వెళ్లాడు. గురువారం రాత్రి 9:30 గంటలకు కూలీ డబ్బులు ఇవ్వాలని అతని ఇంటికి వెళ్లాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో తాగిన మత్తులో ఉన్న మురళి పక్కనే ఉన్న రాములు బస్సు అద్దాలను పగల గొడుతుండడంతో గమనించిన రాములు కోపంతో మురళిపై కర్రతో దాడి చేశాడు. దాడిలో గాయపడిన మురళి శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి దుర్సోజు ఐలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాత తగాదాల నేపథ్యంలో..


కమలమ్మ (ఫైల్‌)

నెక్కొండ: వారు ఒకే ఇంటి కోడళ్లు.. ఓ కోడలికి పక్కింటి వారితో జరుగుతున్న గొడవ మధ్యలోకి మరోకోడలు వెళ్లింది. ఈక్రమంలో తారాస్థాయికి చేరిన వాగ్వాదం దాడివరకు వెళ్లడంతో ఓ మహిళ మృతిచెందిన ఘటన వరంగల్‌ జిల్లా నెక్కొండ మండలంలోని పత్తిపాకలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఎస్సీ కాలనీలో తోటి కోడళ్లయిన తాళ్ల కమలమ్మ (68), తాళ్ల లచ్చమ్మల మధ్య కొంతకాలంగా గొడవలు ఉండేవి. అయితే శనివారం ఉదయం ఇంటి పక్కన ఉన్న ఈదునూరి ఉప్పలమ్మకు కమలమ్మల మధ్య గొడవ జరుగుతోంది. ఈ గొడవలో లచ్చమ్మ కలుగజేసుకొని ఉప్పలమ్మకు మద్దతుగా కమలమ్మపై వ్యక్తిగత దూషణలకు దిగింది. వీరి మధ్య గొడవ తీవ్రస్థాయికి చేరడంతో కోపోద్రేకురాలైన లచ్చమ్మ కర్రతో కమలమ్మ తలపై దాడి చేసింది. ఈ ఘటనలో కమలమ్మ తలకు తీవ్ర గాయమై రక్తస్రావమై కుప్పకూలింది. కమలమ్మను కాలనీవాసులు చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మధ్యలో మృతి చెందింది. సమాచారం అందుతున్న ఇన్‌చార్జ్‌ ఎస్సై (చెన్నరావుపేట) మహేందర్‌ ఘటనా స్థలికి చేరుకొని గొడవకు దారితీసిన తీరుపై విచారణ చేపట్టారు. మృతురాలి కుమారుడు రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. లచ్చమ్మను అదుపులోకి తీసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించామని ఆయన పేర్కొన్నారు.

కరోనాతో ఒకరి మృతి

- ఎంజీఎం కోవిడ్‌ వార్డులో నలుగురికి చికిత్స
- జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న వైద్యులు

ఎంజీఎం : వరంగల్‌ ఎంజీఎం ఆస్పత్రిలో కరోనా పాజిటివ్‌గా నిర్ధారించబడి కోవిడ్‌ వార్డులో చికిత్స పొందుతున్న భూపాలపల్లి జిల్లా గణపురానికి చెందిన 38 సంవత్సరాల యువకుడు శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. సదరు యువకుడు మార్చి 31వ తేదీన జనరల్‌ మెడిసిన్‌ విభాగంలో అడ్మిట్‌ అయ్యాడని ఎంజీఎం సూపరింటెండెంట్‌ డాక్టర్‌ చంద్రశేఖర్‌ తెలిపారు. సదరు యువకుడికి పలు పరీక్షలు నిర్వహించగా క్రానిక్‌ అల్కహాల్‌, లివర్‌ సిరోసిస్‌తో ఆస్పత్రిలో చివరిదశలో ఉన్నట్లు తెలిపారు. ఈ వ్యాధులకు సంబంధించిన చికిత్సలు అందిస్తున్న క్రమంలో 7వ తేదీన ఉదయం రాపిడ్‌ పరీక్షలు నిర్వహించగా పాజిటివ్‌గా తేలిందని వెలడించారు. ఇతనికి ఎలాంటి కరోనా లక్షణాలు లేవని, అందుకే కరోనా పేషంట్‌గా నిర్ధారించలేదన్నారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి 12.10కు మృతి చెందినట్లు తెలిపారు.

కోవిడ్‌ వార్డులో నలుగురికి చికిత్స..

ఎంజీఎం ఆస్పత్రిలోని కోవిడ్‌ వార్డులో నలుగురు చికిత్స పొందుతున్నట్లు ఎంజీఎం వైద్యులు తెలిపారు. కరోనా లక్షణాలు లేకున్నా వ్యాధి వ్యాప్తినెమ్మదిగా పెరుగుతుందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎంజీఎం ఆస్పత్రిలో కరోనా వ్యాధిగ్రస్తులకు అన్ని రకాల చికిత్సలు అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంజీఎం సూపరింటెండెంట్‌ పేర్కొన్నారు. ఆక్సిజన్‌ పడకలతో పాటు వెంటిలేటర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

జాగ్రత్తలు పాటించాలి..

కరోనా వ్యాధి నెమ్మదిగా విస్తరిస్తున్న క్రమంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని వైద్యారోగ్య శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రతి ఒక్కరూ మాస్కులు ధరిస్తూ శానిటైజర్‌తో చేతులను నిత్యం శుభ్రం చేసుకోవాలని సూచించారు. రద్దీగా ఉండే ప్రదేశాల్లో సంచరించకుండా భౌతిక దూరం పాటించాలని సూచించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


సంధ్య(ఫైల్‌)

టేకుమట్ల: జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని ద్వారకపేటలో శుక్రవారం రాత్రి విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ద్వారకపేట గ్రామానికి చెందిన సల్పాల సంధ్య(34) శుక్రవారం రాత్రి స్నానం చేసిన అనంతరం టవల్‌ను దండెంపై ఆరవేస్తున్న క్రమంలో దండానికి విద్యుత్‌ సరఫరా జరిగి విద్యుదాఘాతానికి గురైంది. ఆమె భర్త రమేష్‌ వెంటనే చికిత్స నిమిత్తం ప్రైవేట్‌ వాహనంలో తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలోనే మృతి చెందినట్లు తెలిపారు. కాగా, శనివారం రమేష్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌ కానిస్టేబుల్‌ రమేష్‌ తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లి మృతితో పిల్లల రోదన పలువురిని కంటతడి పెట్టించాయి.

వెంకటాపురం(ఎం): మండలంలోని మల్లయ్యపల్లి గ్రామ శివారులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మంద సారమ్మ (52) అక్కడికక్కడే మృతిచెందింది. వెంకటాపురం ఎస్సై తాజుద్దీన్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నారాయణపూర్‌ ఎస్సీ కాలనీకి చెందిన మంద సారమ్మ సుబ్బక్కపల్లెలోని తన కూతురు ఇంటికి కాలినడకన వెళ్తుండగా, నారాయణపూర్‌ నుంచి మల్లయ్యపల్లికి బైక్‌పై వస్తున్న రతన్‌సింగ్‌ సారమ్మను ఢీకొట్టాడు. దీంతో సారమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. ద్విచక్రవాహనానికి లైట్‌ రాకపోవడంతో చీకటిలో సారమ్మను ఢీకొట్టినట్లు వివరించారు. ద్విచక్ర వాహనంపై ఉన్న రతన్‌సింగ్‌కు కూడా గాయాలు కాగా చికిత్స నిమిత్తం ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

మడికొండ: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కుమ్మరిగూడెం గ్రామ శివారులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం కుమ్మరిగూడెంకు చెందిన నార్లగిరి కర్ణాకర్‌(46) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. అయితే కుటుంబ అవసరాల నిమిత్తం కులసంఘంలో అప్పు తీసుకున్నాడు. నెలనెలా వాయిదా కట్టడానికి ఇబ్బంది ఏర్పడడంతో కొద్ది రోజులుగా కిస్తీలను ఎలా కట్టాలో భార్యతో చెబుతూ మదనపడేవాడు. ఈక్రమంలో మనస్తాపానికి గురై శనివారం తెల్లవారుజామున తన వ్యవసాయ భూమి వద్ద ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కర్ణాకర్‌ భార్య రజిత కూలీలతో కలిసి బావి వద్దకు వెళ్లగా తన భర్త చెట్టుకు ఉరి వేసుకొని ఉండటాన్ని చూసి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తుల సమాచారంతో అక్కడకు చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎస్సై రాత పరీక్ష తొలిరోజు ప్రశాంతం


అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీస్‌ అధికారులు


పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న సీపీ రంగనాథ్‌

- పరీక్ష కేంద్రాలను సందర్శించిన సీపీ

వరంగల్‌ క్రైం: పోలీస్‌ నియామకాల్లో భాగంగా స్టయిఫండరీ క్యాడెట్‌ ట్రైనీ పోలీస్‌ సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ రాత పరీక్ష తొలిరోజు ప్రశాంతంగా జరిగింది. శనివారం ఉదయం 10 గంటల నుంచి 1గంట వరకు నిర్వహించిన మొదటి పేపర్‌ పరీక్షకు వరంగల్‌ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలో 14,387 మంది అర్హత సాధించగా 13,756 మంది అభ్యర్థులు హాజరుకాగా, 631 మంది గైర్హాజరయ్యారని వరంగల్‌ పోలీస్‌ కమిషనర్‌ రంగనాథ్‌ తెలిపారు. సాయంత్రం నిర్వహించిన రెండో పేపర్‌ పరీక్షలో 13,704 హాజరు కాగా, 683 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద అభ్యర్థులను క్షుణంగా పరిశీలించిన తర్వాతనే పరీక్ష హాల్‌లోకి అనుమతించారు. అభ్యర్థులకు ఇబ్బందులు కలుగకుండా ట్రైసిటీ పరిధిలోని రైల్వే స్టేషన్‌, బస్టాండ్‌ల వద్ద హెల్ప్‌ డెస్కులు ఏర్పాటు చేశారు. ఖమ్మం జిల్లా నూజివీడుకు చెందిన నాగరాణి ఎస్సై రాత పరీక్ష కోసం రాగా హనుమకొండ కేడీసీ వద్ద కళ్లు తిరిగి కింద పడిపోవడంతో అధికారులు ఆస్పత్రికి తరలించారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన..

పరీక్ష కేంద్రాలను వరంగల్‌ పోలీస్‌ కమిషనర్‌ రంగనాథ్‌ సందర్శించారు. సీపీ బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజనీరింగ్‌ కళాశాల, ములుగురోడ్డులోని ఎల్‌బీ కళాశాల కేంద్రాలను సందర్శించి బందోబస్తును పరిశీలించారు. సీపీ వెంట ట్రైనీ ఐపీఎస్‌ అధికారి అంకిత్‌ కుమార్‌ ఉన్నారు.

వికసించిన ఈస్టర్‌ పుష్పం



చెన్నారావుపేట: ప్రతి సంవత్సరం ఏప్రిల్‌ మాసంలో జరిగే ఏసుక్రీస్తు పునరుత్థానం(ఈస్టర్‌) పండుగ ముందు ఈ పుష్పం పూస్తుంది. వరంగల్‌ జిల్లా చెన్నారావుపేట మండల కేంద్రంలోని రాజీవ్‌నగర్‌ కాలనీకి చెందిన తాళ్ల యాకయ్య-కరుణశ్రీ ఇంటిలో ఈస్టర్‌ పుష్పం వికసించి చూపరులను ఆకట్టుకుంటుంది. దీంతోపాటు కోనాపురం గ్రామానికి చెందిన ఎడ్ల నారాయణరెడ్డి- మంజుల ఇంటి ఆవరణలో కూడా ఈ పుష్పం వికసించింది.

కోతి ఒడిలో కుక్కపిల్ల..!



గార్ల : కోతిని చూస్తే కుక్క.. కుక్కను చూస్తే కోతి.. కస్సుబుస్సులాడుకోవడం సహజం. కానీ, మానుకోట జిల్లా గార్ల మండలంలోని సీతంపేట హైస్కూల్‌ ఆవరణలో ఓ కోతి ఏకంగా కుక్కపిల్లను ఒడిలోకి తీసుకుని లాలించడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది. చెట్ల కొమ్మలు, ఇళ్లపై తిరుగుతున్న సమయంలోనూ.. కుక్కపిల్లను వీడకుండా తన బిడ్డలాగే.. జాగ్రత్తగా తనతో తిప్పుకోవడం గమనార్హం.